www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 10 ఏప్రిల్ 2023
5
చిత్తూరు



నేడు నగరపాలక కార్యాలయంలో 'స్పందన'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరవాసుల సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక ఆవరణలో సోమవారం (10.4.2023) ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారు మాస్కులు ధరించి, కోవిడ్-19 నిబంధనలను పాటించాలని కోరారు. స్పందన కార్యక్రమానికి నగరపాలక శాఖాధిపతులు హాజరుకావాలని అన్నారు. అన్ని వార్డు సచివాలయల్లోనూ సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య స్పందన కార్యక్రమం జరుగుతుందని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటితో పాటుగా నగరపాలక సంస్థ కాల్ సెంటర్ నెంబర్ 08572- 232745, వాట్సప్ నంబర్ 98499 07885 ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు.

వేసవి వచ్చేసింది.. జాగ్రత్తలు పాటించండి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మండు వేసవిలో ఉష్ణోగ్రతలు పెరగడంతో శరీరంలో నీటిశాతం తగ్గి వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఏప్రిల్ మాసంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదౌతున్నాయి. పగలంతా ఎండవేడి, రాత్రిళ్లలో ఉక్కుపోతలతో జనం అల్లాడి పోతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రత్తలతో శీతల పానీయాలు, ఏయిర్‌కూలర్, ఎయిర్ కండిషన్లకు గిరాకి పెరిగింది. ఏసీలు, కూలర్లు వాడకం పెరడగంతో విద్యుత్ వినియోగం పెరిగింది.

వేసవి తాపాన్ని తట్టుకోవడం కోసం కాస్త జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యాన్ని నిలకడగా ఉంచుకోవడంతో పాటు వడదెబ్బ నుండీ కాపాడుకొచ్చని ఇందుకోసం అధిక ప్రోటీన్స్ కలిగిన మాంసం, మసాల కూరలు, ఆయిల్ ఆహార పదార్థలను తీసుకోవడం మంచిది కాదు. శీతల పానియాలు (సహజసిద్ధమైన) తీసుకోవడంతో పాటు కర్బుజా, దోస, కీరదోస వంటివి ఎక్కువగా తీసుకోవాడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.



జాగ్రత్తలు పాటిస్తే వడ్డదెబ్బకు దూరం..

వేసవికాలంలో అధిక ఉష్ణోగ్రత, వేడిగాలుల కారణంగా వడదెబ్బ (సన్‌స్ట్రోక్) డీహైడ్రేషన్ వచ్చే అవకాశముంది. చమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, ఫిట్స్ లేదా పాక్షికంగా అసస్మారక స్థితి, మగత నిద్ర లేదా కలవరింతలు వంటివి వడదెబ్బ లక్షణాలు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

సురక్షితమైన తాగునీరు, పండ్లరసాలు, కొబ్బరినీళ్ళు, పల్చటి మజ్జిగ వంటి ద్రవపదార్థలు ఎక్కువగా తీసుకోవాలి. తెల్లటి కాటన్ దుస్తులు ధరించాలి. రోజుకు కనీసం 15గ్లాసుల సురక్షితమైన తాగునీటిని తీసుకోవాలి. ఉదయం, సాయంత్రం రెండు పూటల చల్లటి నీటితో స్నానం చేయడం, భోజనం మిత్తంగా తినడం, అధిక ఉష్ణోగ్రత ఉన్న సమయంలో ఇంటిపట్టునే ఉంటూ అత్యవసర పరిస్థతుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే వెంట గోడుగు తీసుకుపోవడం చేయాలి. ఇంట్లో కిటికీలు తెరచి ఉంచడంతో పాటు ఫ్యాన్, కూలర్ వేసుకొని గదిలో చల్లగా ఉండేలా చూసుకోవాలి.

చేయకూడనివి..

మండువేసవిలో త్రీవ ఉష్ణోగ్రత ఉన్న సమయాల్లో ఎక్కువగా బయట తిరగరాదు. సూర్యకిరణాలకు, వేడిగాలికి గురికారాదు. రోడ్లుపై విక్రయించే హానికర శీతలపానీయాలు తీసుకోరాదు. మాంసం తగ్గించడంతో పాటు మద్యంపానం చేయకూడదు. ఉష్ణోగ్రత అధికంగా ఉండే సమయాల్లో శరీరంపై భారంపడేలా బరువులు మోయరాదు. నలుపు, మద్దంగా ఉన్న దుస్తులు ధరించరాదు.



వడదెబ్బ సోకితే ఇలా చేయాలి..

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడగల ప్రదేశానికి చేర్చాలి. చల్లటినీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరాన్ని తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణస్థితికి వచ్చే వరకు తడిగుడ్డతో తుడవాలి. ఫ్యాను కింద చల్లటి గాలి తగిలేలా ఉంచాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజ్ ద్రావణాన్ని లేదా ఆర్‌ఆర్‌ఎస్‌ను నీటిలో కలిపి తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారకస్థితిలో ఉన్న వారికి నీరు తాగించరాదు. వీలైనంత త్వరగా సమీపంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి.

అవగాహన కల్పిస్తున్నాం..

వేసవిలో ప్రజలు వడదెబ్బ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని అలర్ట్ చేశాము. జిల్లాలోని పిహెచ్‌సీ, సీహెచ్‌సీలతో పాటు 104 సంచార వాహనాలు, అర్బన్‌హెల్త్ సెంటర్లలో ఓఆర్‌ఎస్ ఫ్యాకెట్లను అందుబాటులో ఉంచాం. ఏఎన్‌ఎంల వద్ద కూడా ప్రాథమిక చికిత్సకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి. ఉపాధి హామీ పనుల జరుగుతున్న ప్రాంతాల్లో మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలని సూచించడం జరిగింది. ముఖ్యంగా పాఠశాలల్లో కూడా విద్యార్థులు తాగునీటిని అదుబాటులో ఉంచడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలి. ఉష్ణోగ్రత అధికంగా ఉండే సమయాల్లో బయట తిరగడం మంచిది కాదు. వైద్యఆరోగ్యశాఖ సూచన మేరకు సురక్షితమైన శీతలపానీయాలు తీసుకోవడంతో పాటు మసాల ఆహారపదార్థలు తీసుకోకుండా మద్యం సేవించరాదు. వడదెబ్బ సోకిన్నట్లు గుర్తించిన వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకుపోవాలి.

- డాక్టర్ ప్రకాశం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

కందకాలు తవ్వుతున్నాం

ఏనుగుల దాడి నుంచి పంటలను కాపాడేలా విద్యుత్ కంచెలు : డిఎఫ్ఒ చైతన్య కుమార్‌రెడ్డి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం, వర్షాభావ పరిస్థితుల్లో నీటికోసం వన్యమృగాలు అడవుల సమీపాల్లోని గ్రామాల్లోకి వస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో వన్యమృగాల తాగునీటి కోసం కందకాలు ఏర్పాటు చేస్తున్నాం. జనవాసాల్లోకి రాకుండా సోలార్ కంచెలను ఏర్పాటు చేయడం జరుగుతోంది. చిత్తూరు జిల్లాలోని పడమటి మండలాల్లో ఏనుగుల సంచారం ఎక్కువగా ఉంటోంది. ఈ ప్రాంతాల్లోని అడువుల సమీప గ్రామాల్లో ఏనుగులు పంట పొలాలపై పడుతున్నాయి. ఏనుగుల కదలికలను గుర్తించిన వెంటనే అటవీశాఖ సిబ్బంది సమాచారం ఇవ్వాలి. వాటిని ఒంటిరిగా ఎదుర్కొవడం మంచిది కాదు. గ్రామస్తులు పెద్దపెద్ద శబ్దాదాలు చేయడం మంచిది. ఎట్టి పరిస్థితుల్లోని వాటిని గాయపర్చడం వంటివి చేయరాదు. విద్యుత్ తీగలు ఏర్పాటు, మందు పాత్రలు పెట్టడం చట్టరిత్యా నేరం అనే విషయాన్ని గుర్తించుకోవాలి. జిల్లాలో 1.95లక్షల హెక్టార్లలో అటవీ భూములున్నాయి.

చిత్తూరు జిల్లాలోని పలమనేరు, యాదమరి, తవణంపల్లి, కుప్పం ప్రాంతాలు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న గ్రామాల్లో ఏనుగులు రావడం జరుగుతోంది. జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో వున్నవి వచ్చినవి వేర్వేరుగా జిల్లాలో సంచరిస్తున్నాయి. గత మూడు సంవత్సరాల్లో 10 ఏనుగులు మరణించగా 6మంది మత్యువాత పడ్డారు. వీరికి పరిహారం అందించాం 3,400 మందికి సంబంధించి పంట నష్టం జరిగింది. పంటనష్టం, ఏనుగుల దాడిలో మృతులకు ఇచ్చే పరిహారం పెంచాలని విజ్ఞప్తులు వస్తున్నాయి. పరిహారం పెంచాలని ప్రభుత్వానికి నివేదించాం.

ఏనుగుల దాడి నుంచి పంటలను కాపాడేలా అటవీ ప్రాంత సరిహద్దుల్లో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాం. అలాగే ఏనుగుల అడవిదాటి రాకుండా కందకాలు తవ్వతున్నామని జిల్లా అటవీ శాఖాధికారి చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రజాశక్తి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో... జిల్లాలో అడవుల పరిస్థితి ఏనుగుల దాడులపై తెలియజేస్తూ...

ప్రజాశక్తి: జిల్లా అడవుల విస్తీర్ణం ఎంత ఉంది...?

డిఎఫ్ఒ: చిత్తూరు జిల్లాలో మొత్తం అడవులు 29శాతం మేర విస్తరించి 1.95లక్షల హెక్టర్లలో ఉన్నాయి. ఈ అడువులు శేషాచలం అడవులకు అనుసంధానంగా ఉంటున్నాయి.

ప్రజాశక్తి : ఎలిఫెంట్ జోన్ అంటే ఏమిటి విస్తీర్ణం ఎంత....?

డిఎఫ్ఒ: జిల్లాలోని 1.95లక్షల హెక్టర్ల అటవీప్రాంతంలో 353 చదరపు కిలోమీటర్లు కౌండిన్య రాయల్ ఎలిఫెంట్ జోన్‌ను ఏర్పాటు చేసి ఏనుగుల సంరక్షణ జిల్లాలో సుమారు మూడు నియోజకవర్గాల్లో ప్రధానంగా నిత్యం ఏనుగులు సంచరిస్తూ పంటపొలాల కోసం రావడం రైతులకు ఇబ్బందికరంగా మారుతోంది. కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాలలో ప్రస్తుతం అనధికారిక లెక్కలప్రకారం భారీఎత్తున ఏనుగులున్నట్లు అటవీ శాఖాధికారులు అంచన వేశాం. ఆహారం, నీటి కోసం పంటపొల్లోకి వస్తున్న ఏనుగుల నుంచి పంటను కాపాడుకోవడం కోసం రైతులు ఏనుగులను అడవిలోకి తరిమే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఏనుగుల దాడిలో మరణాలు చోటు చేసుకుంటున్నాయి.

ప్రజాశక్తి: ఏనుగుల దాడిలో ఎంత మంది మరణించారు. పంట నష్టం ఎంత అందిస్తున్నారు...?

డిఎఫ్ఒ: ఏనుగుల దాడిలో మూడు సంవత్సరాల లెక్కల ప్రకారం ఆరుగురు మృతి చెందారు. వీరి నష్టపరిహారం చెల్లించడం జరిగింది. పంట నష్టం, ఏనుగుల దాడిలో మృతిచెందిన వారికి నష్టపరిహారం పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాధనలు పంపాం. ప్రకృతి వైపరిత్యాల సందర్భంగా ఇచ్చే పరిహారం ఎలా ఏనుగుల దాడిలో మరణించిన వారికి కేంద్ర ప్రభుత్వం ఆర్థికసాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నుండీ కేంద్రానికి ప్రతిపాదనలు పంపడం జరిగింది. మూడేళ్ల కాలంలో 3,400ప్రాంతాల్లో పంటనష్టం చోటు చేసుకున్నట్లు అటవీశాఖ వద్ద సమాచారం ఉంది.

ప్రజాశక్తి: ఏనుగుల దాడి నుంచి పంట పొలాలను కాపాడేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు...?

డిఎఫ్ఒ: ఏనుగులు అటవీ ప్రాంతం నుంచి బయటకు రాకుండా కాంటూరు కందకాలు తవ్వడం, ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ వేయడం జరుగుతున్నది. ఇప్పటివరకు 70 కిలోమీటర్లకు పైగా సోలార్ ఫెన్సింగ్ వేయగా మరో 60 కిలోమీటర్లు తవ్వడం జరిగింది. ప్రజలను భయాందోళన నుంచి బయటపడేసేందుకు ప్రభుత్వం తగుచర్యలు చేపడుతోంది. అటవీశాఖ ఆధ్వర్యంలో ట్రాకర్లను ఉపయోగించి పంటపొలాల వైపు వచ్చిన ఏనుగులను తిరిగి అటవీ ప్రాంతాల్లోకి ట్రాప్ చేయడం నిరంతరంగా జరిగే ప్రక్రియ. మొదట టపాకాయలు పేల్చి బయటకు పంపే ప్రక్రియతో పాటు ట్రాకర్లతో దారి మళ్ళించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంది. క్యాంప్ ద్వారా సుమారు 78కిలోమీటర్ల మేరకు అటవీ ప్రాంతంలో ఏనుగులు వచ్చి కదలికలు గుర్తించే అవకాశముంది.

ప్రజాశక్తి: ఏనుగులు దాడి చేయకుండా ఎలాంటి పంటలను సాగుచేయాలి..?

డిఎఫ్ఒ: పట్టుపురుగుల పంటపై ఏనుగులు దాడిచేసే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. ఈ మేరకు పట్టుపరిశ్రమ అధికారుల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పట్టుపురుగుల పంటను సాగుచేయాలని ఏనుగులు దాడులు అధికంగా ఉన్న ప్రాంతాల్లోని రైతులను ప్రొత్సహించడం జరుగుతోంది.



చైతన్య కుమార్ రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి

బీసీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్




సమావేశంలో మాట్లాడుతున్న నారగోని

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: బీసీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన బిసి సంఘాల ఐక్య సంఘర్షణ సమితి రౌండ్‌టుబుల్ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పూలే జయంతి సంబరాలను పురస్కరించుకొని బీసీ నాయకులు పూసల రవి అధ్యక్షతన బిసి సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ముఖ్య అతిధిగా మాజీ ప్రొఫెసర్ నారగోని మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు రెండు తెలుగు రాష్ట్రాలలో రెండు మూడు అగ్రకులాలే పాలిస్తున్నాయని నేడు బీసీలంతా ఐక్యంగా తాము అగ్రకుల బానిసలం కాదు.. పాలిస్తామంటూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో అన్ని సీట్లకు పోటీ చేసేలా రాజకీయ సమీకరణలు మారుతున్నాయన్నారు. బిసి జనగనన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలని, బిసి కార్పొరేషన్లకు ఒక్కో కార్పోరేషన్‌కు రూ.2వందల కోట్లు కేటాయించాలని, శాసన మండలి స్థానాలు కేటాయించానలి రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. సమావేశంలో బీసి నాయకులు షణ్ముగం, ప్రసాద్‌లతో పాటు పలువురు బీసి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒలంపిక్ అసోషియేషన్

నూతన కార్యవర్గం ఏర్పాటు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పురుషోత్తం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోషియేషన్ నూతన కార్యవర్గ ఏర్పాటు సమావేశం ఆదివారం స్థానిక సిందూటవర్స్‌లో జరిగింది. ఎన్నికల నిర్వాహకులుగా మాజీ జడ్జి ప్రవీన్‌కుమార్ వ్యవహరించారు. రాష్ట్రంలో క్రీడా మైదానాల ఏర్పాటు, స్టేడియంల నిర్మాణంతోపాటు క్రీడాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో స్టేడియంల నిర్మాణం క్రీడారులను ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. ఒలపింక్ అసోషియేషన్ అధ్యక్షులుగా పురుషోత్తం, సహాయ కార్యదర్శిగా లక్ష్మిలతో పాటు 13మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

తిరుపతి నుంచి వందే భారత్ పయనం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నుంచి సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్ప్రెస్ రైలు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల 15 నిమిషాలకు బయలు దేరింది. ఈ రైలు బయలుదేరే ముందు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జవహర్‌రెడ్డి టీటీడీ ఈవో ధర్మారెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జెసి డీకే బాలాజీ, కమిషనర్ హరిత, జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ జెండా ఊపి రైలు పంపించారు. వందే భారత రైలు చూడడానికి తిరుపతి నుంచి భారీ సంఖ్యలో రైల్వే స్టేషన్‌కి తరలివచ్చారు. వీరితో పాటు ప్రయాణికులు అధికారులు ఉన్నతాధికారులు తరలివచ్చారు.

నిషిద్ధ భూముల వివరాలను బహిరంగపరచాలి


సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం అక్రమార్కుల భూములను క్రమబద్ధీకరించడానికే రెండు లక్షల ఎకరాలను నిషిద్ధ జాబితా 22 (ఏ) నుండి తప్పించిందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ భూముల వివరాలను తక్షణమే బహిరంగపరచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఆదివారం ఒక ప్రకటనలు డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యానంతరం భూముల సర్వే (ఆర్ఎస్ఆర్) చేసిన సందర్భంగా తమ బతుకుతెరువు కోసం కొంతమంది పేద రైతులు వలస వెళ్ళడం లేదా సర్వేచేసిన సందర్భంగా అందుబాటులో లేకపోవడంతో అటువంటి భూములను ప్రభుత్వ భూములతో సమానంగా నిషిద్ధ భూములని చుక్కలు పెట్టారు. ఈ భూములు అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు చేయడానికి లేదని నిషేధించారు. ఈ నిషిద్ధ భూములలో నిజమైన హక్కుదారులు రాష్ట్ర వ్యాప్తంగా 25లక్షల వరకు ఉంటారని, జిల్లాలో 10 వేల మంది పైగా గత తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించింది. ఈ భూములకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలని 22(ఏ)ను ఎత్తివేయాలని కొంతమంది రైతులు హైకోర్టుకు వెళ్ళారు. కోర్టు 2014లో అర్హుల భూములకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలని, 22(ఏ)ను ఎత్తివేయాలని ఆదేశించింది. కానీ నేటికీ హైకోర్టు తీర్పును ప్రభుత్వం అమలు చేయలేదు. రాష్ట్రంలో భూముల విలువ పెరిగిన తరువాత అనేక మంది రాజకీయ పలుకుబడి కలిగినవారు, భూకబ్జాకారులు పేదలకు చెందిన భూములను ఆక్రమించుకున్నారు. వీటిలో చుక్కల భూములు కూడా ఉండడం వల్ల ఈ భూములను నిషేధిత జాబితా నుండి తొలగించాలని మంత్రులు, పలుకుబడి కలిగిన వారు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో 2లక్షల ఎకరాలను 22 (ఏ) నుంచి తొలగించినట్లు విధితమవుతున్నది. తరతరాలుగా పేదలు సాగు చేసుకుంటున్న భూములకు మాత్రం నిషేధం ఎత్తివేయలేదు. పైగా అక్రమార్కులకు మాత్రం నిషేధం ఎత్తివేయడం గర్హనీయం. మరోవైపు పేదల భూములను రెగ్యులరైజ్ చేయడానికి లక్షల రూపాయిలు వసూలు చేస్తున్నారని ఇది సరైంది కాదు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా సాగులో ఉన్నటువంటి సన్న, చిన్నకారు రైతుల భూములను రెగ్యులరైజ్ చేయాలి. అనర్హులకు రెగ్యులరైజ్ చేసిన భూములను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నదని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు తీర్పును అమలు చేసి సన్న,చిన్నకారు రైతుల చుక్కల భూములను నిషేధ జాబితా నుండి తొలగించాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.

డిసెంబర్‌కి అందుబాటులో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

ప్రజాశక్తి- తిరుపతి సిటి: టిటిడి నిర్మిస్తున్న చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని డిసెంబర్ నాటికి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహార్‌రెడ్డి అధికారులకు సూచించారు. టిటిడి ఈవో ధర్మారెడ్డి, జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, ఇతర అధికారులతో కలిసి ఆదివారం ఆయన అలిపిరి వద్ద నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను, టిటిడి గోశాలలోని ఫిడ్ మిక్సింగ్ ప్లాంట్, ఆగర బత్తీల తయారీ రెండోవ యూనిట్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ నిర్మాణం వల్ల గోశాలలోని గోమాతలు, ఇతర పశువులలకు బలవర్థకమైన సమగ్ర దాణా అందించే అవకాశం కల్గిందని అన్నారు. తద్వారా పాలఉత్పత్తి పెరగడంతో పాటు, పాలల్లో ప్రోటీన్ శాతం కూడా గణనీయంగా వృద్ధి చెందుతుందని అన్నారు. టిటిడి ఆలయాల్లో ఉపయోగించిన పువ్వులతో తయారు చేస్తున్న ఆగర బత్తీలకు బక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ఇందుకు అనుగుణంగా టిటిడి రెండోవ యూనిట్‌ను ప్రారంభించడాన్ని ఆయన అభినందించారు. శ్రీపద్మావతి హృదయాలంలో 1300కు పైగా చిన్నపిల్లలకు గుండె శస్త్రచికిత్సలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ ఆసుపత్రిలో ఇటీవల రెండు మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించిన ఆసుపత్రి డైరెక్టరు డాక్టరు శ్రీనాథ్‌రెడ్డి, ఆయన బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం శ్రీపద్మావతి విశ్రాంతి గృహంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, స్విమ్స్ క్యాన్సర్ ఆసుపత్రి, తిరుమలలో అంజనాద్రి అభివృద్ధిని సమీక్ష జరిపారు. తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ బృందావనం పనులు, శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ ప్రగతి, ఉద్యోగులకు ఇళ్లస్థలాలు పంపిణీ, ఈహెచ్ఎస్ ట్రస్ట్, బర్డ్ ఆసుపత్రిలో కాక్లియర్ ఇంప్లాంట్, గ్రహణ మొర్రి సర్జరీలు నిర్వహిస్తున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. టిటిడి విద్యాసంస్థల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. తిరుపతిలోని అన్ని కళాశాలలో హాస్టళ్లకు సెంట్రలైజ్డ్ కిచెన్‌ఏర్పాటు చేసి అంశంపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సిఈవో విజయ్ కుమార్, జిల్లా కలెక్టరు వెంకట రమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ బాలాజీ, టిటిడి చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, స్విమ్స్ డైరెక్టరు డాక్టరు వెంగమ్మ, డాక్టరు శ్రీనాథరెడ్డి, డాక్టరు రెడ్డెప్పరెడ్డి, డాక్టరు రవి, డాక్టరు హరినాథరెడ్డి, రామసునీల్‌రెడ్డి పాల్గొన్నారు.



చిన్నపిల్లల ఆసుపత్రి గురించి అధికారులతో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జవహర్ రెడ్డి

శ్రీవారు, అమ్మవార్లకు బంగారు చీరలు

ప్రజాశక్తి- తిరుపతి సిటి: తెలంగాణ రాష్ట్రం సిరిసిల్లకు చెందని నల్ల విజయ్ తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామికి, తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారికి అగ్గిపెట్టలో పట్టే బంగారు చీరలను బహుకరించారు. తిరుపతి శ్రీపద్మావతి విశ్రాంతి గృహంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టరు కెఎస్.జవహార్‌రెడ్డి చేతులు మీదగా వీటిని అందించారు. స్వామివారికి రూ.45వేల విలువ చేసే బంగారు చీరను, అగ్గిపెట్టెలో పట్టేలా ఆయన తయారు చేయించారు. శ్రీపద్మావతి అమ్మవారికి అగ్గిపెట్టెలో పట్టేలా 5గ్రాముల బంగారుతో జరీ చీరను తయారు చేయించి ఇచ్చారు. ఈసందర్భంగా దాతను ఆయన అభినందించారు.





శ్రీ పద్మావతి అమ్మవారిసేవలో ఆర్థికశాఖ మంత్రి

ప్రజాశక్తి- తిరుచానూరు: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం ఉదయం రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్‌తో కలిసి రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దర్శించుకున్నారు. అమ్మవారి కుంకుమసేవలో పాల్గొని మొక్కలు చెల్లించుకున్నారు. వారికి ఆర్డీవో కనక నరసారెడ్డి, డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏవిఎస్వో శైలేంద్ర బాబు, ఏఈవో ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆగమ సలహాదారు శ్రీనివాస్చార్యులు, ఇన్స్పెక్టర్లు ప్రసాద్, అశోక్ ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్విమ్స్‌లో వర్క్‌షాప్



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ

ప్రజాశక్తి-తిరుపతి సిటి: స్విమ్స్ సిటి సర్జరీ విభాగం ఆధ్వర్యంలో హాండ్స్ ఆఫ్ వాస్కులర్ అనాస్తోమోసిస్ వర్క్‌షాపును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్విమ్స్ డైరెక్టరు డాక్టరు వెంగమ్మ మాట్లాడుతూ వాస్కులర్ అనస్టోమోషన్ అనేది రెండు రక్తనాళాలు ఒకదానికొకటి అనుసంధానించబడి, పునరుద్దరించబడిన శస్త్రచికిత్స ప్రక్రియ. ఇది నిరోధించబడిన, దెబ్బతిన్న నాళంలో రక్తప్రవాహాన్ని మెరుగుపరచడానికి, రక్తగాయాలను సరిచేయడానికి, రెండు నాళాల మధ్య బైపాస్‌ను రూపొందించడానికి నిర్వహిస్తారన్నారు. ఈ ప్రక్రియ సమయంలో సర్జన్ జాగ్రత్తగా కుట్లు, స్టేపుల్స్, ఇతర పదార్థాలను ఉపయోగించిచ రెండు నాళాలను కలుపుతారు, కనెక్షన్ ఎటువంటి లీక్‌లు లేకుండా సురక్షితంగా ఉండేలా చూస్తారు. ఈప్రక్రియ సాధారణంగా కరోనరి అర్టరీ బైపాస్‌గ్రాఫ్టింగ్, హీమోడయాలసిస్ కోసం వాస్కులర్ యాక్సిస్, అవయవ మార్పిడి వంటి వాస్కులర్ సర్జరీలలో ఉపయోగడపతుందని అన్నారు. ప్రక్రియ విజయం, సర్జన్ నైపుణ్యం, అనుభవం, రోగి ఆరోగ్యం, నాళాలను కనెక్ట్ చేయడానికి ఉపయోగించే పదార్థాల నాణ్యతపై ఆధారపడి ఉంటుందన్నారు. అనంతరం డాక్టరు వాసుదేవరెడ్డి బేసిక్స్ ఆఫ్ వాస్కులర్ అనాటమీ, డాక్టరు సత్యవతి ప్రిన్సిపుల్స్ ఆఫ్ వాస్కులర్ ట్రక్షన్, డాక్టరు సెంథిల్ కుమార్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ వాస్కులర్ ఇంజరిస్, డాక్టరు అమితావిక్రమా బేసిక్స్ ఆఫ్ ఎండో వాస్కులర్ ఇంటర్వెన్షన్స్, డాక్టరు వినోద్‌బాను ప్రిన్సిపుల్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ అరటీరియల్ ఇజీసెస్, డాక్టరు శివశంకర్ ఫార్మకో థెరపి ఇన్ వాస్కులర్ డిసిజెస్ అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో డాక్టరు శ్రీకాంత్, డాక్టరు శ్రీహరిరావు, వైద్యులు, సిటి.సర్జరీ విభాగపు వైద్యులు నవీన్, కీర్తిక, పిజి వైద్యులు, ఎంబిబిఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మస్వప్నం నవల ఆవిష్కరణ



ప్రజాశక్తి-పలమనేరు: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళా మందిరంలో ఆదివారం కట్టమంచి కష్ణవేణి రచించిన అమ్మ స్వప్నం నవలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షులు జొన్న విత్తుల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ సమాజాన్ని సాహిత్యం ప్రతిబింబించేలా ఉండాలన్నారు. సమాజాన్ని మార్చే శక్తి సాహిత్యానికి ఉందన్నారు. పలమనేరు బాలాజీ మాట్లాడుతూ పుస్తకాలను చదివే అలవాటును ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలన్నారు. రచయిత్రి నవలలో ఒక తల్లీబిడ్డల భవిష్యత్తును గురించి కనే కలలన్నింటినీ ఆవిష్కరించందన్నారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు పి.తులసినాథం నాయుడు, పుష్ప లు రచయిత్రి క్రిష్ణవేణిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెల్వ కుమార్, బాల సుబ్రమణ్యం, మొహిద్దీన్, చంద్ర శేఖరయ్య, సుదర్శ నాచారి, శివ శంకర్, గురునాథం, గిరిధర్ మూర్తి, చెన్నకేశవులు, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పశువుల పండుగ

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ కోణంగి పల్లె గ్రామంలో ఆదివారం పశువుల పండుగ జరిగింది. ఈ పోటీలలో పరుగులు తీసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పశువులు అధిక సంఖ్యలో వచ్చాయి. వాటి యజమానులు ఉదయం నుంచి దుద్దెలో కట్టేసి, వాటి కొమ్ములకు పట్టీలను కొట్టారు. కొన్ని పశువులను



యువకులు నిలువరించి వాటి కొమ్ములకు కట్టిన బహుమతులను చేజిక్కించుకొని ఆనందంతో కేరింతలు పెట్టారు. కొన్ని పశువులు యువకులకు చిక్కకుండా పరుగులు తీశాయి. గ్రామస్తులు ఈ పరుగు పందేలను తిలకించడానికి వచ్చిన ప్రజలకు మంచినీళ్ల, అన్నదానం కార్యక్రమం చేశారు.

బడ్జెట్ అనుగుణంగా ఉపాధి పనులు




ప్రజాశక్తి-పాలసముద్రం: లేబర్ బడ్జెట్‌కు అనుగుణంగా ఉపాధి హామీ పథకం పనులు ఎంపిక చేసుకోవాలని వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్ మహేష్ బాబు అన్నారు. గతంలో గ్రామసభలో గుర్తించే పనులను ఆదివారం ఏపీఓ బాల, జై అనుష్క క్షేత్రస్థాయిలో పరిశీలించి వేస్ట్‌మెట్ వేశారు. ఏపీవో బాల మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పంటకాలువ పునరుద్ధరణ, చెరువులో పూడికతీత, ఉద్యాన పంట సాగు, భూగర్భ జలాల పెంపొందింపు తదితర పనులను చూసుకోవచ్చని తెలిపారు. అలాగే ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు పెంచుకోవచ్చని, బీడు భూములను సాగులోకి తీసుకురావచ్చని వివరించారు. వాలంటరీలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ లోకేష్, వాలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు రూరల్ మండలం కరిడిమడుగు గ్రామంలో వెలిసిన ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం గ్రామస్తులు, వేదపండితుల మంత్రోచ్ఛరణాలతో ఘనంగా నిర్వహించారు. ఆదివారం పలమనేరు సబ్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రంజిత్ షా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రంజిత్ షా మాట్లాడుతూ శ్రీ సీతా రాముల కల్యాణంలో పాల్గొనడం అదష్టంగా భావిస్తున్నానని, స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులకు, గ్రామస్తులకు, భక్తులకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేద పండితులు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కరిడిమడుగు సర్పంచ్ సుబ్రమణ్య రెడ్డి, హేమ కుమార్, శివకుమార్, మురళి, వినోద్, గోవిందయ్య, పెద్దసంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన టిడిపి కార్యకర్తలు



ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని బల్ల పంచాయితీలో పలువురు టిడిపి కార్యకర్తలు, ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైసీపీలో చేరారు. ఆదివారం బల్ల గ్రామంలో టిడిపికి చెందిన 15 కుటుంబాల వారికి ఎమ్మెల్సీ భరత్ వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై కార్యకర్తలు పార్టీలో చేరారన్నారు. ఇల్లు లేనివారికి స్థలాలు మంజూరు చేసి, నిర్మాణాలు చేపడతామన్నారు. అమ్మ ఒడి, రైతు భరోసా, పెన్షన్లు, విద్యాదీవెన, వసతి దీవెన, ఆరోగ్యశ్రీ ఇతర వాటిని సమగ్రవంతంగా అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ విద్యాసాగర్, బాబు రెడ్డి, విజయ్, రెస్కో డైరెక్టర్ థామస్, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, సంతోష్, అల్లా బక్షు, షేక్ అహ్మద్, పార్టీలో చేరిన కార్యకర్తలు నాగరాజు, సత్యరాజు, వెంకటరమణ, మురుగేష్, శ్రీదేవి, రజిని, శిరీష, హరిబాబు తదితరులు ఉన్నారు.

ఆక్వా రైతులకు విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

ప్రజాశక్తి-వాకాడు: చిట్టమూరు విద్యుత్ శాఖ ఉప కార్యాలయం ఎదుట విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని కోరుతూ ఆదివారం టీడీపీ ఆధ్వర్యంలో ఆక్వా రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ గణపతి కిషోర్‌నాయుడు మాట్లాడుతూ వెంటనే విద్యుత్తు ఛార్జీలు తగ్గించకుంటే ప్రజలే ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడు కస్తూరయ్య, మండల టీడీపీ కార్యదర్శి చిన్నారావు, సుబ్రహ్మణ్యం, అరవపాలెం సర్పంచ్ రాజేష్‌రెడ్డి, ఆక్వా రైతులుపాల్గొన్నారు

నేడు విద్యుత్ ఛార్జీల పెంపుపై నిరసన

ప్రజాశక్తి-రామకుప్పం: టిడిపి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాల్లో భాగంగా స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం పార్టీ అధిష్టానం ఆదేశాలతో నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటలకు టిడిపి నేతలు, కార్యకర్తలు, పంచాయతీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి, యూనిటీ ఇన్‌ఛార్జిలు, మహిళలు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యాలయానికి తరలిరావాలన్నారు. అనంతరం ర్యాలీగా బందార్లపల్లి 32/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలపాలని కోరారు. అలాగే ఈనెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి



సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. కుప్పం పట్టణంలో జయంతి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించాలని మండలంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుబ్బు, మాజీ ఎంపీపీ వెంకటేష్, మాజీ జడ్పిటిసి రాజ్‌కుమార్, నేతలు రామకష్ణప్ప, విశ్వనాథ్, వెంకటాచలం, మనోహర్, గజేంద్ర, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుడిపల్లి: మండలంలో విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేస్తున్నట్లు, ఈ కార్యక్రమంలో భాగంగా గుడిపల్లి సబ్‌స్టేషన్ వద్ద సోమవారం ఉదయం 11 గంటలకు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు టి.ఎం బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కావున మండల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణ బాలికోన్నత పాఠశాలలో గత 25 సంవత్సరాలకు మునుపు ప్రధానోపాధ్యాయురాలుగా, ఉప విద్యా శాఖాధికారిగా పనిచేసి పదవీ విరమణ పొందిన చంద్రమ్మ పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు రూ.10వేలు ప్రోత్సాహక బహుమతులను ప్రకటించారు. ఆదివారం పాఠశాలలో ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం కుప్పమ్మ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమ్మ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పనిచేసిన పాఠశాల విద్యార్థులకు చేయూత అందించాలని తమ కుటుంబం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ ఏడాది 10వ తరగతిలో మొదటి, రెండవ, మూడవ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సహం కలిగించేందుకు రూ.10 వేలను కుప్పమ్మకు చెక్ అందించామన్నారు. వచ్చే ఏడాది నుంచి మంచి ర్యాంకులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.ఐదు, మూడు, రెండు వేలు చొప్పున తామే అందిస్తామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. చంద్రమ్మ హెచ్‌ఎంగా చేస్తున్న సమయంలో విద్యను అభ్యసించిన పిదప ప్రధానోపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పలువురు ఆత్మీయులు, యూటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి సోమచంద్రారెడ్డి, ఎల్‌ఐసీ యుగంధర్, రిటైర్డ్ హెచ్‌ఎంలు విజయలక్ష్మి, హేమావతిలు పాల్గొని చంద్రమ్మ, ఆమె కుటుంబ సభ్యులు చేసిన సేవలను కొనియాడారు. గతంలో కీలపట్ల గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ కోనేటి రాయస్వామి ఆలయానికి రూ.6 లక్షలు విలువ చేసే కిరీటాన్ని బహూకరించిన విషయాన్ని గుర్తుచేసుకొని చంద్రమ్మ దంపతులను పాఠశాల తరపున సాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో చంద్రమ్మ భర్త నల్లారెడ్డి, కుమార్తెలు శ్రీలక్ష్మి, శ్రీలత పాల్గొన్నారు.



రాజకీయాల్లో మార్పు కోరుతున్న ప్రజలు

ప్రజాశక్తి-సోమల: రాష్ట్రంలో ప్రజలు రాజకీయ వ్యవస్థలో మార్పులను కోరుకుంటున్నారని, దీనికి 2024వ సంవత్సరంలో జరిగే ఎన్నికలలో ప్రజల తీర్పుతో సుసాధ్యం కానున్నదని ప్రముఖ వ్యాపారవేత్త బీసీ సంఘం నాయకులు బోడె రామచంద్ర యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని నెల్లిమంద పంచాయతీలో ఆయన విస్తతంగా పర్యటించారు. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గం అభివద్ధికి ఆమడ దూరంలో ఉందని, తాను రాజకీయంలోకి రావడానికి కారణం నియోజకవర్గాన్ని అభివద్ధి పథంలో నడపడం, యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించి ఎన్నో పరిశ్రమలను తీసుకురావడమే లక్ష్యంగా వచ్చానని అన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాల నుండి విముక్తి పొందేందుకు ఎదురుచూస్తున్నారని రానున్న ఎన్నికలలో ప్రజల ఆశయాలకు అనుగుణంగా మార్పును చూసే అవకాశం ఉందని ఇందుకోసం తాను నిరంతరం ప్రజల పక్షాన నిలిచి పోరాడుతానని తెలిపారు. తనకు ఎవరిపైనా వ్యక్తిగతంగా,



రాజకీయంగా అభిప్రాయ బేధాలు లేవని కేవలం మార్పు కోరుతున్న ప్రజల అభీష్ట మేరకే వచ్చే ఎన్నికలలో తాను పుంగనూరు నియోజకవర్గంలో శాసనసభ్యులుగా పోటీ చేసి ప్రజల అభిమానంతో ఎన్నిక కావడం జరుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామంలో తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకుని వారికి తన వంతు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోమల నగేష్, పుంగనూరు సాంబ, రామచంద్ర యాదవ్ అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అభివృద్ధి

జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: సంక్షేమ పథకాలతో రాష్ట్రం అభివద్ధి చెందుతుందని జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా అన్నారు. ఆదివారం మండలంలోని బంగారుపాళ్యం హరిజనవాడలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం జడ్పిటిసి సోమశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వైసీపీ వెళ్లి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్నటువంటి సంక్షేమ కార్యక్రమాలు లబ్ధిదారులకు అందుతున్నాయా అని పరిశీలించారు. అనంతరం జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా మాట్లాడుతూ అర్హత ఉండి సంక్షేమ ఫలాలు అందని వారుంటే గ్రామ వాలంటీర్ల ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం పేదవారికి సంక్షేమ ఫలాలు అందించాలనే సంకల్పంతో సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో తిరిగి జగన్‌ని ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రతి కార్యకర్త, లబ్ధిదారులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉషా వరదయ్య, సచివాలయ కన్వీనర్లు సుబ్రహ్మణ్యం, కార్యకర్తలు జగదీష్, సుబ్రహ్మణ్యం, రవి, మాణిక్యం, వాసు, వార్డు మెంబర్లు, వాలంటీర్లు, గహసారథులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని పాతగుంట సచివాలయంలో గ్రామాలలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షులు కామసాని పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి గడపకు స్థానిక వైసీపీ నాయకులు వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను తెలియచెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట, గహ సారథుల కన్వీనర్ బట్టే సుబ్రహ్మణ్యం, పుత్తూరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మరకాల కుప్పం రామయ్య, వైస్ ఎంపీపీ జెగిని విజయ మునికృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ భువనేశ్వరి, మాజీ సర్పంచ్ కె.గోవిందన్, వాలంటీర్లు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మహతి ఫౌండేషన్ బైరెడ్డిపల్లి వారి సహకారంతో పిఎస్ ఆస్పత్రి కుప్పం వారి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తీర్థంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 318 మంది చికిత్సకు హాజరు కాగా వారిని పరిశీలించి కంటి ఆపరేషన్‌కు 37 మందిని సెలెక్ట్ చేశారు. అలాగే 25 మందికి షుగర్ 6 మంది గుర్తించి వారికి ముందులు, మాత్రలు అందజేశారు. కంటి ఆపరేషన్‌కు సెలెక్ట్ అయిన వారిని మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో ఉచితంగా రానుపోను బస్ సౌకర్యం, ఆపరేషన్ జరిగే సమయంలో ఉచితంగా చేసే విధంగా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ధరణిదర్ రెడ్డి, భరత్, జనరల్ మెడికల్ వైద్యులు ప్రవీణ్ కుమార్, మిథున్ చక్రవర్తి, కుప్పం పిఎస్ సహాయకులు, మారుతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు, మహతి ఫౌండేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చంద్రగిరిలో కార్యకర్తలే నా కుటుంబం: నాని

ప్రజాశక్తి-తిరుపతి అర్బన్: చంద్రగిరి నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలే నా కుటుంబమని.. సమస్యలను గుర్తించి అధికారుల దష్టికి తీసుకెళ్లడానికి అందరి ముందుకొస్తున్నానని.. ఇప్పుడు నాయకులు, కార్యకర్తలతో ఎలా ఉన్నానో అధికారంలోకి వచ్చినా అలాగే ఉంటానని నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాని అన్నారు. ఆదివారం తిరుపతి రూరల్ మండలం తనపల్లిలో టీడీపీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల12 నుంచి 'మీ ఇంటికి మీ నాని' కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు. నామినేటెడ్ పదవుల్లో గాని.. ఇతర పదవుల్లో గాని తన భార్య, కుమారుడు, కోడలు జోక్యం ఉండదన్నారు. కేవలం ముఖ్యమైన కార్యక్రమాలు, ప్రచారంలో మాత్రమే పాల్గొంటారని తెలిపారు. ప్రతిఒక్కరికీ న్యాయం చేసేలా పని చేస్తానన్నారు. అందరూ కలిసికట్టుగా 2024లో చంద్రగిరి కోటపై టీడీపీ జెండా ఎగరేద్దామని తెలిపారు. 'మీ ఇంటికి మీ నాని' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. టిడిపి జాతీయ కార్యదర్శి బీద రవిచంద్ర మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పని అయిపోయిందని.. రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని తెలిపారు. చంద్రగిరిలో పులివర్తి నానిని గెలిపించే బాధ్యత ప్రతిఒక్క టీడీపీ కార్యకర్తపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పరసరత్నం, మండలాల అధ్యక్షులు, జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



కరియమాణిక్య స్వామి సేవలో సబ్ జడ్జి



ప్రజాశక్తి-నగరి: తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ నాంపల్లి కోర్టులో సబ్ జడ్జిగా ఉన్న సి.సాయి సుధ ఆదివారం నగరి పట్టణంలోని కరియమాణిక్య స్వామి ఆలయాన్ని, దేశమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. దేశమ్మ దేవతకు చీర, రవిక, గాజులు, పసుపు, కుంకుమలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తండ్రి కాశీ విశ్వేశ్వర రావు 1998-99 సంవత్సరంలో నగరి కోర్టులో జడ్జిగా ఉండేవారని అప్పుడు నగరిలోని ప్రైవేటు పాఠశాలలో చదువుకున్నానన్నారు. తాను చిన్నప్పుడు వెళ్లిన ఆలయాలను చూడాలని నగరికి విచ్చేసినట్లు చెప్పారు.

టిడిపితోనే అభివృద్ధి..!

ప్రజాశక్తి-రామకుప్పం: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం హయాంలోనే రాష్ట్రం అభివద్ధి చెందిందని మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బందార్లపల్లి పంచాయతీలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి గత టిడిపి ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చంద్రబాబు నాయుడు అనేక పథకాలు ప్రవేశపెట్టి ఆర్థిక అభివద్ధి చేశారని గుర్తు చేశారు. ఇప్పటి ప్రభుత్వం నిత్యావసర ధరలు పెంపుతో పాటు విద్యుత్ చార్జీలు, కోతలు, బస్ ఛార్జీలు, పెట్రోల్, డీజిల్ ధరలు రెట్టింపు చేసి సామాన్యులు జీవనం కోల్పోయే విధంగా చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఆదరించి గెలుపునకు కషి చేయాలని తెలియజేశారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు. రానున్న తెలుగుదేశం ప్రభుత్వంలో పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ రఫీ, పెరుమాళ్, శ్రీనాథ్ రెడ్డి, మునిరెడ్డి, వెంకటాచలం, సుబ్రహ్మణ్యం, రఘు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



ప్రజాశక్తి-పాలసముద్రం: రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు చట్టాలను కఠిన తరం చేస్తున్న చిత్తూరు ఎస్పీ రిశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ బి సురేష్ చెప్పారు. ఆదివారం పాలస్టర్ మంత్రం పోలీస్ స్టేషన్ ఆవరణలో ద్విచక్రదారులకు హెల్మెట్ ధరించటంతో వచ్చే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పై మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే వాహనాన్ని సీజ్ చేసి జరిమానా వేస్తామని తెలిపారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపి చిన్న వయసులోనే మతి చెందుతున్నారని, అలాంటివి జరగకుండా ఉండాలంటే తప్పకుండా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ముఖ్యంగా మైనర్ పిల్లలు ద్విచక్రవాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై చర్యలు తప్పవని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు అరికట్టాలంటే రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని సూచించారు.

ఘనంగా ఈస్టర్ పండుగ వేడుకలు



ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలోని పోలీస్ లైన్‌లోని 'కార్నర్ స్టోన్' చర్చిలో లైట్ ఆఫ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని చర్చిల్లో ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆరాధనా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా లోకరక్షకుడు, ఏసు క్రీస్తు మత్యువును జయించి పునరుత్థానం అయిన దినాన్ని 'ఈస్టర్' పండుగగా వేడుక జరుపుకుంటారని సంఘ ఫౌండర్ పాస్టర్ జాన్ బోధించారు. ఈ కార్యక్రమంలో రెవ.శామ్యూల్, దివ్య, మేరీజాన్, విశ్వాసులు, సంఘ పెద్దలు, సంఘ సభ్యుల పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు రెండో పట్టణ పరిధిలోని బాల సదన్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నూతన వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను క్లబ్ సభ్యులు దాత శ్రీనివాసాచారి ప్రారంభించారు. అనంతరం ఫుడ్ ఛాయిస్ కార్యక్రమంలో చిన్నారులకు కోరిన ఆహార పదార్థాలను అందించారు. క్లబ్ సీనియర్ సభ్యులు దశరథ రామి రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ సమాజంలో పేద వారికి సహాయం చేసేందుకు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు మయూరి శ్యామ్ యాదవ్, ముని గిరీష్, శ్రీధర్‌రెడ్డి, రవి కుమార్, జి.జి.నాయుడు, రామ్ ప్రసాద్, కష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరాలు-ఘోరాలు

పూరి గుడిసె దగ్ధం...!



ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని చెల్దిగానిపల్లి గ్రామంలో పూరిగుడిసె దగ్ధమైంది. ఆదివారం బాధితురాలు సరోజమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు... చల్దిగానిపల్లి ఎంపీపీ పాఠశాల వద్ద పూరె గుడిసె వేసుకొని అందులో టీ దుకాణం, పాఠశాలకు మధ్యాహ్న భోజనం చేస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడిసెకు నిప్పంటించారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అక్కడ వెళ్లి చూడగా గుడిసె పూర్తిగా కాలిపోయిందని, దుకాణంలో ఉన్న వంట సామాగ్రి, పాత్రలు, టేబుళ్ల, రూ.10 వేల నగదు అగ్నికి ఆహుతైందన్నారు. పూరి గుడిసె కాలిపోవడంతో సుమారు 60 వేల నష్టం వాటిల్లిందని తెలిపారు. గుడిసెకు నిప్పంటించిన వారిని గుర్తించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



ప్రజాశక్తి-సోమల: రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలైన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు..మండల కేంద్రమైన సోమల బస్టాండ్ సమీపంలో తిరుపతి నుంచి పుంగనూరుకు వెళుతున్న పుంగనూరు డిపో బస్సు సోమల కొత్తపేట వీధికి చెందిన మోహన్ కుమార్(24) ద్విచక్ర వాహనంపై వెళుతుండగా బస్సు ఢీకొనడంతో యువ కుడికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వైద్యం నిమిత్తం పీలే రు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు, ప్రమాద సంఘటనపై యువకుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

టిప్పర్ బోల్తా పడి డ్రైవర్‌కు...



ప్రజాశక్తి-కార్వేటినగరం: టిప్పర్ బోల్తా పడిన సంఘటన మేజర్ పంచాయతీ కార్వేటినగరం సమీపంలోని చిన్నకనుమ మలుపులో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా... పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరం వైపు ముగ్గుపిండి లోడుతో వస్తున్న టిప్పర్ చిన్నకనుమ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పచ్చికా పల్లం నుంచి కార్వేటినగరం వైపుగా వచ్చే టిప్పర్లు ఎక్కువ బరువును తీసుకు రావడంతో చిన్నకనుమ వద్ద డ్రైవర్లు వాహనాన్ని అదుపు చేయలేక వారానికి రెండు, మూడు సార్లు ప్రమాదానికి గురవుతుంటాయి. నిత్యం వాహన చోదకులు పళ్లిపట్టు, కార్వేటినగరం నుంచి తిరుపతికి ఈ మార్గంలో ప్రయాణం చేస్తుంటారు. అయితే పెద్ద కనుమ నుంచి చిన్నకనుమ వరకు రోడ్డు నిటారుగా ఉండటంతో టిప్పర్లు లారీలు అదుపు తప్పి 15 అడుగుల లోయలోకి బోర్లాపడుతుంటాయని అంటున్నారు. గతవారం అదే ప్రాంతంలో టిప్పర్ అదుపుతప్పి 33 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడటంతో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయపడ్డాడు. అలాగే గత నెలలో కూడా ఓ టిప్పర్ అదుపు తప్పి పడి ఆవును ఢీకొనడమే కాకుండా కార్వేటినగరంలోని గాండ్ల మిట్ట కూడలిలో నిల్చున్న ఇద్దరు వ్యక్తులను ఢీకొని ఓ మహిళ మతి చెందింది. ఓ వ్యక్తిని సుమారు 200 మీటర్ల వరకు లాక్కెళ్లిన సంఘటనలు జరుగుతున్నాయని అక్కడి వారు అంటున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి పెద్దకను, చిన్న కనుమల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే టిప్పర్ల వేగానికి కళ్లెం వేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండల కేంద్రంలోని కస్తూరిబా గురుకుల పాఠశాల సమీపంలోని మామిడి తోటలో మందులు పిచికారీ చేస్తుండగా ప్రమాదవశాత్తు మందుల ట్యాంకర్ బోల్తా పడింది. ప్రమాదంలో ట్యాంకర్‌పై నుంచి సుబ్రహ్మణ్యం (47) అనే వ్యక్తి అక్కడికక్కడే మతిచెందగా.. రామ్మూర్తి (47) అనే వ్యక్తికి రెండు కాళ్లు పూర్తిగా విరిగిపోయాయి. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సోదరుడు చెవిరెడ్డి రఘునాథరెడ్డి విషయం తెలియగానే సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులకు సహాయ చర్యలు చేపట్టి గాయపడ్డ వారిని తిరుపతి రుయా హాస్పిటల్ కి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ తులసీరామ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రమణీయం.. లక్ష్మీనారాయణుని అభిషేకం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో గల శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలోని మూలవిరాట్‌లో గల విగ్రహాలకు అర్చకులు అభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ పూజలకు యూఎస్‌ఏకి చెందిన పంకజం రంగస్వామి, శేషాద్రి రంగస్వామి ఉభయదారులుగా వ్యవహరించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన భాగవతార్ టి.వి.సుబ్రమణ్యం హరికథ కాలక్షేపం చేయగా, అన్నమయ్య సంకీర్తనలు, వెంకటేశ్వర భక్తిగీతాలను రమేష్ బాబు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేష్ రెడ్డి, అర్చకులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.



బీజేపీ హటావోను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈనెల 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఉభయ కమ్యూనిస్టు పార్టీలు దేశవ్యాప్తంగా చేపడుతున్న బిజెపి హటావో – భారత్ బచావో కార్యక్రమాన్ని ప్రజలు జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టాక దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు ఎలా పతనావస్థకు చేరుకున్నాయో, కార్పొరేట్ శక్తులు ప్రపంచ స్థాయికి చేరుకున్నారో ఈ సందర్భంగా మురళి వివరించారు. రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసి దేశంలో మోడీ సాగిస్తున్న దౌర్జన్యకాండను బిజెపి హటావో భారత్ బచావో కార్యక్రమంతో ప్రజల మధ్యనే ఎండగట్టాలని పిలుపునిచ్చారు. డేగా ప్రభాకర్, జనమాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.